సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



నీ మేలు మరువలేం

మహానేత రాజశేఖరరెడ్డి పాలనలో భీమవరం నియోజకవర్గంలో పేదలకు స్వర్ణయుగం. ఆయన హయాంలో పేదల సొంతింటికల నెరవేరింది. IIలో ▸



కౌలు రైతులకు లబ్ధి

కౌలు రైతుల ఖాతాలకు రూ.8.76 కోట్లు జమ చేశారని ఏలూరు ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. IIలో ▸

అగ్గిపుల్లపై మహానేత వైఎస్



ఏలూరు (టూటౌన్): వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని అగ్గిపుల్లపై ఆయన చిత్రాలను ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్ట్, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్ బాబు రూపొందించి ఘనంగా నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రీ సర్వే, అసైన్డ్ భూములు, సివిల్ సప్లయిస్, గృహ నిర్మాణం తదితర 16 అంశాలపై జిల్లాలోని అన్ని మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ప్రగతి అడిగి తెలుసుకున్నారు. లక్ష్యసాధనలో వెనుకబడిన మండలాల అధికారులపై కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. మూడో దశ రీ సర్వేపై గ్రామాల్లో ప్రతి రైతుకు సమాచారం ఇవ్వాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో ప్రతి రైతు తమ పంట భూమి, ఆధార్‌తో అనుసంధానం చేయించాలని, చేసుకుంటేనే లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన గృహాలలో మౌలిక వసతులు కల్పించి గృహప్రవేశాలు పూర్తి చేయాలన్నారు. విద్యుదీకరణ, అంతర్గత రోడ్లు, తాగునీటి పనులు తదితర సదుపాయాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సర్వే అధికారి కె జాషువా, గృహ నిర్మాణ శాఖ పీడీ డా. ఆర్‌సి ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: అనంతపురంలో ఈ నెల 2, 3, 4వ తేదీల్లో జరగనున్న అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఎస్.జావలి, మహి సునీల్, మనస్విని, మొడియం సాత్విక ఉన్నారని స్కూలు ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులను స్కూలు చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు అభినందించారు.

మంచి పేరు వచ్చేలా పనిచేయాలి



హరికృష్ణ, చంద్రశేఖర్‌లకు నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (టూటౌన్): జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులుగా నియమితులైన పాలిమేర హరికృష్ణ, విటాల చంద్రశేఖర్‌లకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని శుక్రవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అందించిన ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్, ఏపీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌లను అనుసరించి పనిచేయాలని, సంబంధిత శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తొలుత హరికృష్ణ, చంద్రశేఖర్‌లు నానిని కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకాలకు కారకులైన మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ శ్రీధర్, మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఇడా చైర్ పర్సన్ ఈశ్వరీ బలరాంలకు ధన్యవాదాలు తెలిపారు.

చేపల ప్యాకింగ్ లారీ బోల్తా



బోల్తా పడిన చేపల ప్యాకింగ్ లారీ

కై కలూరు: ఆలపాడు ఆదర్శ స్కూల్ వద్ద శుక్రవారం చేపల ప్యాకింగ్ లారీ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు కైకలూరు నుంచి ఆకివీడు వైపు వెళ్తున్న ప్యాకింగ్ లారీ పామర్రు – దిగమర్రు నేషనల్ హైవే సమీప మార్జిన్‌లో తిరగబడింది. డ్రైవర్, క్లీనర్, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆకివీడు ఫల్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

82 శాతం పెన్షన్ల పంపిణీ

ఏలూరు (మెట్రో): జిల్లా వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వెళ్లి వలంటీర్లు పెన్షన్లు అందించారు. జిల్లా వ్యాప్తంగా 2.71 లక్షల మంది కోసం రూ.75.23 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. రాత్రి 8 గంటల వరకు 2,21,403 మందికి పింఛన్లు పంపిణీ చేశారు.

- ఉమ్మడి పశ్చిమ గోదావరిపై వైఎస్‌కు ఎనలేని ప్రేమాభిమానాలు
- పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన
- చింతలపూడి ఎత్తిపోతలకు శ్రీకారం
- గూడెంలో ఉద్యాన వర్సిటీ ఏర్పాటు
- రూ.3500 కోట్లతో కొల్లేరు ప్రజలను ఆదుకున్న సంక్షేమ ప్రదాత
- నేడు వైఎస్సార్ వర్ధంతి

రాష్ట్రంలో అభివృద్ధికి, సంక్షేమానికి చిరునామా ఆయన.. అభివృద్ధికి బాటలు వేసినా, ఏ పథకం పెట్టినా ప్రజల బాగు కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిరంతరం తపించేవారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాపై ఎనలేని ప్రేమాభిమానాలు కురిపించారు. పోలవరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఉద్యాన వర్సిటీకి ఊపిరి పోశారు. చింతలపూడి ఎత్తిపోతలను ప్రారంభించారు. కొల్లేరు ప్రజలను ప్రత్యేక ప్యాకేజీతో ఆదుకున్నారు. ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో అభివృద్ధి పనులు ఆయన గొప్పతనాన్ని చాటిచెబుతాయి. నేడు వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జిల్లాలో ఆయన చేసిన అభివృద్ధి సంతకంపై ప్రత్యేక కథనం..



మహానేత.. అభివృద్ధి ప్రదాత

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంపై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారు. మనసున్న మారాజుగా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారు. ఐదేళ్ల తన పాలనలో వందల కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి పనులతో ఈ ప్రాంత ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నూజివీడు నియోజకవర్గంతో ఉన్న అనుబంధం ఎంతో గొప్పది. నూజివీడులో పర్యటించిన ప్రతిసారీ వరాల జల్లు కురిపించారు. ఎమ్మార్ అప్పారావు కాలనీని ఏర్పాటు చేసి నాలుగు వేలమందికి ఇళ్ల స్థలాలే కాకుండా నాలుగు వేల ఇళ్లు మంజూరు చేశారు. పట్టణ ప్రాంత ప్రజల దాహార్తిని పరిష్కరించేందుకు కృష్ణాజలాల ప్రాజెక్టును రూ.66 కోట్లతో మంజూరు చేశారు.

ట్రిపుల్‌ఐటీతో మారిన రూపురేఖలు

నూజివీడులో ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీని స్థాపించి పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. రూ.1200 కోట్లతో తరగతి గదుల భవనాలు, హాస్టల్ భవనాలు, మెస్ భవనాలు, ఆడిటోరియం, విద్యార్థులకు ప్రత్యేకంగా ఆసుపత్రిని నిర్మించి వేలాది మంది పేద వర్గాల, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నతమైన సాంకేతిక విద్య అందేలా ఏర్పాట్లు చేశారు. ట్రిపుల్‌ఐటీలో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు మంచి ఉద్యోగాల్లో స్థిరపడి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకున్నారు. నూజివీడు ప్రాంతంలో మామిడి పరిశోధనా స్థానం, ఉద్యానవన పంటల చీడపీడల నియంత్రణ కేంద్రాన్ని రూ.12 కోట్లతో ఏర్పాటు చేశారు. 2007లో మామిడి పంట నష్టపోయిన రైతులకు రూ.25 కోట్ల పరిహారం మంజూరు చేశారు. రూ.1.5 కోట్లతో పెద్దచెరువుకు సాగర్ జలాలు అందించారు. రూ.1.10 కోట్లతో సుంకొల్లు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి బీడు వారిన ఆయకట్టును సాగులోకి తెచ్చారు. చాట్రాయి, విస్సన్నపేట మండలాల్లో 30,030 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.15.10 కోట్లతో నూతిపాడు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు.



ఉద్యానవర్సిటీ శంకుస్థాపన పనుల్లో.. వైఎస్సార్, ప్రస్తుత డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ (ఫైల్)



నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని అకడమిక్ భవనం

ఉద్యాన వర్సిటీకి ఊపిరి

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ హయాంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెట్టింది. వైఎస్ ముఖ్యమంత్రి, కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్న ఆ సమయంలో ఐదేళ్లలో రూ.650 కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గంలో జరిగాయి. ట్రాఫిక్ సమస్య నుంచి పరిష్కారంగా వైఎస్ హయాంలో రెండో ఫ్లైఓవర్ వంతెన నిర్మించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట పల్లె ప్రజలకు చల్లని నీడ దొరికింది. రాజీవ్ గృహకల్ప పేరిట 280 పేద కుటుంబాలకు పక్కా సొంత మయ్యాయి. ఉద్యాన విద్య చేరువలోకి వచ్చింది. వైఎస్ మానస పుత్రిక ఉద్యాన విశ్వవిద్యాలయం ఏర్పాటుతో పరిశోధన ఫలితాలు రైతులకు ఎంతో మేలు చేకూర్చింది. వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. ఉన్నత విద్య కోసం ఏయు క్యాంపస్ (ప్రస్తుతం నన్నయ్య క్యాంపస్) ఏర్పడింది. భూగర్భ డ్రైనేజీ కార్యాచరణకు నోచుకుంది. బోడపాడు డ్రెయిన్ పనులు, పరిమెళ్ల అండర్ టన్నెల్ పనులు, జట్లపాలెంలో బక్లిస్ డ్రెయిన్ పనులు, ఏరియా ఆసుపత్రిలో సీమాంక్ సెంటర్ ఏర్పాటు చేశారు. రెండో వేసవి జలాశయానికి రూ. 33 కోట్లు మంజూరు చేశారు. ఉద్యాన వర్సిటీలో భవనాల నిర్మాణం కోసం రూ.157 కోట్లు నిధులు వచ్చాయి. ఐదేళ్లలో రూ.650 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు వైఎస్సార్ హయాంలో జరిగాయి.

వైఎస్ కలల ప్రాజెక్టు



చింతలపూడి ఎత్తిపోతల ప్రధాన కాల్వ

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గ ప్రజలపై వైఎస్ చెరగని ముద్ర వేశారు. మెట్ట రైతుల సాగునీటి కోసం కష్టాలను పాదయాత్ర సమయంలో రైతులు వైఎస్ దృష్టికి తీసుకురావడంతో ఆయన ముఖ్యమంత్రి అయ్యాక రూ.1701 కోట్ల అంచనా వ్యయంతో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు. 2008 అక్టోబరు 30న కామవరపుకోటలో స్వయంగా శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లాలోని 15 మెట్ట ప్రాంత మండలాల్లో 2.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. గుడ్డిగూడెం ఎత్తిపోతల పథకాన్ని విస్తరించి చింతలపూడికి అనుసంధానం చేశారు. కృష్ణా, ఉమ్మడి పశ్చిమలో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా మరో రూ.3,200 కోట్లు కేటాయించారు.

జలయజ్ఞంలో కలికితురాయి

పోలవరం రూరల్: దివంగత మహానేత వైఎస్సార్ జలయజ్ఞంలో కలికితురాయి పోలవరం ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు పనులకు 2004లో వైఎస్ శ్రీకారం చుట్టారు. తొలిగా ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్మాణం చేపట్టారు. అవి రాజశేఖర్‌రెడ్డి హయాంలో శరవేగంగా నిర్మాణం జరుపుకున్నాయి. తదుపరి వచ్చిన ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణ విషయంలో అలసత్వం ప్రదర్శించాయి. దీంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి. ఆయన కలలు సాకారం చేసే దిశగా 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత నిరంతరం కృషిచేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలు సరిదిద్దుతూ నిర్మాణ పనులు వేగంగా కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని సైతం ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములు చేస్తూ దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం సంకల్పాన్ని పూర్తి చేసేందుకు సీఎం శ్రమిస్తున్నారు.



పోలవరం ప్రాజెక్టు

కొల్లేరుకు ప్రత్యేక ప్యాకేజీ

కైకలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో కొల్లేరు విస్తరించి ఉంది. కొల్లేరు పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు జీవో నెంబరు 120 ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో తప్పనిసరి పరిస్థితుల్లో కొల్లేరు ఆపరేషన్ చేపట్టారు. అక్రమ చేపల చెరువులను తొలగించారు. దీంతో అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి కొల్లేరు ఆపరేషన్‌లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రత్యేక పునరావాస ప్యాకేజీ కింద రూ.3500 కోట్లు కేటాయించి కొల్లేరు ప్రజలపై ప్రేమ చాటుకున్నారు. కొల్లేరు కాంటూరును 5 నుంచి 3కు కుదించాలని అసెంబ్లీతో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించారు. కొల్లేరులో ప్రజలు సంప్రదాయ చేపల సాగునకు అధికారులు అడ్డుపెట్టవద్దని ఆదేశించారు. ఈ విధంగా కొల్లేరు ప్రాంత ప్రజలకు అండగా నిలిచారు. ప్రస్తుత ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) రాజశేఖరరెడ్డి పాలనలో కై కలూరు పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు. దివంగత రాజశేఖరరెడ్డితో డీఎన్నార్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది.

మెడికల్ కాలేజ్‌లో క్లాసులు ప్రారంభం



ప్రభుత్వ మెడికల్ కాలేజీలో తొలిరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ప్రిన్సిపల్ డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్

- జిల్లా చరిత్రలో సువర్ణాధ్యాయం
- తరగతులకు 112 మంది వైద్య విద్యార్థుల హాజరు

ఏలూరు టౌన్: రాష్ట్ర వైద్య చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖిస్తూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు నెలకొల్పారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా సెప్టెంబర్1న ఏలూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి ఏడాది తరగతులు లాంఛనంగా ప్రారంభించారు. ఎంబీబీఎస్ అడ్మిషన్లు పొందిన వైద్య విద్యార్థులంతా క్లాస్‌లకు హాజరయ్యారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఏపీ వైద్యవిద్య అదనపు డైరెక్టర్ డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, బంధువులు పెద్దసంఖ్యలో వైద్య కళాశాలకు చేరుకున్నారు. వైద్య కళాశాలలో సౌకర్యాలు, వసతులను విద్యార్థులకు ప్రిన్సిపల్ వివరించారు. ఏలూరు మెడికల్ కాలేజీలో సౌకర్యాలపై వైద్యవిద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఓరియంటేషన్ ప్రోగ్రామ్ : వైద్యవిద్య అభ్యసించే విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం చేపట్టారు. 112 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు హాజరయ్యారు. వైద్య విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ఇంటరాక్ట్ అయ్యారు. వైద్య విద్యపై అవగాహన కల్పిస్తూ కోర్సుకు సంబంధించిన సబ్జెక్టులు, ఇతర సౌకర్యాలు, ల్యాబ్స్‌పై వివరాలు తెలిపారు. ఆల్ ఇండియా కోటాలో 15 మంది, రాష్ట్ర కన్వీనర్ కోటాలో 61 మంది, బీ కేటగిరీలో 34 మంది, సీ కేటగిరీలో ఇద్దరు అడ్మిషన్లు పొందారు.

విదేశీ భారం లేదు

విద్యార్థులు విదేశాలకు వెళ్ళి వైద్య విద్య అభ్యసించాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ ఏడాది ప్రభుత్వ రంగంలో ఐదు మెడికల్ కళాశాలలు నెలకొల్పారు. తమ పిల్లలను విదేశాల్లోని యూనివర్సిటీల్లో చేర్పించటం, భారీఎత్తున ఫీజులు కట్టే పరిస్థితి లేదు. మన రాష్ట్రంలోనే ఎంబీబీఎస్ చదివే సువర్ణ అవకాశం ఏర్పడింది. హాస్టల్ నుంచీ మెడికల్ కాలేజ్‌కు రావటానికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సైతం ఏర్పాటు చేశారు.

– డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్, ప్రిన్సిపల్, ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజ్

ఏలూరు చరిత్రలో సరికొత్త రికార్డు

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో సరికొత్త రికార్డు నమోదైంది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు హామీ ఇవ్వగా నేడు ప్రభుత్వ వైద్య కళాశాల కళ్ల ముందు సాక్షాత్కరించింది. ఎమ్మెల్యే ఆళ్ళనాని కృషితో మెడికల్ కాలేజీని రూ.525 కోట్ల భారీ నిధులతో ఏర్పాటు చేస్తున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు పాటిస్తూ ఫస్ట్ ఇయర్ ఎంబీబీఎస్ క్లాస్‌లు ప్రారంభించారు. తొలిదశలో మెడికల్ కళాశాల భవన నిర్మాణం రూ.60 కోట్లతో పూర్తిచేయగా.. శాశ్వత భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏలూరు జీజీహెచ్‌లో వైద్య విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించారు. 150 మంది విద్యార్థులకు సరిపడేలా రూ.20 కోట్లతో తాత్కాలిక ప్రాతిపదికన హాస్టల్ నిర్మించారు.

ప్రతి ఇంటి పెద్ద కొడుకులా..

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రతి ఇంటి పెద్దకొడుకులా సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి , దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పట్టణ పరిధిలో నూతనంగా మంజూరైన వృద్ధాప్య, వింతంతు తదితర పింఛన్లను స్థానిక క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ప్రతి నెల 1న తెలవారుజామునే 67 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 2,239 మందికి రూ.2.59 కోట్లు పింఛన్ల రూపంలో నగదును అందిస్తున్నారన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా మంజూరైన పింఛన్లను అందిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ పెన్షన్ కానుక మొదటి రోజు శనివారం జిల్లాలో 81 శాతం మేర పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 2,19,633 మంది ఉన్నారు. వారికి రూ 59.91 కోట్లు చెల్లించాల్సి ఉండగా శుక్రవారం మొత్తం 1,77,951 మందికి పింఛన్లు అందజేశారు. రూ 49.02 కోట్లు చెల్లించారు.



భీమవరం 19వ వార్డులో పింఛన్ అందిస్తున్న వలంటీరు

అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

తాడేపల్లిగూడెం రూరల్: గత ఏడాది చంద్రబాబు వద్ద పీఏగా పనిచేసిన పెండ్యాల శ్రీనివాస్ వద్ద రూ.2 వేల కోట్లకు సంబంధించి లావాదేవీలు ఆధారాలతో సహా బయటపడ్డాయని, దీనిలో రూ.118 కోట్లు దఫదఫాలుగా చంద్రబాబుకు ఇచ్చినట్లు శ్రీనివాస్ ఐటీ అధికారుల వద్ద అంగీకరించాడని, చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ అధికారులు పెండ్యాల శ్రీనివాస్ నుంచి వాంగ్మూలం తీసుకోవడంతో పాటు రాతపూర్వకంగా తీసుకున్నారని వివరించారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు గత ఐదు రోజులుగా బీజేపీ నాయకులతో మంతనాలు చేస్తున్నాడని విమర్శించారు. వారు నమ్మే పరిస్థితి లేదన్నారు. నేడో...రేపో చంద్రబాబును అరెస్టు చేసేందుకు ఐటీ అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. పోలవరం, అమరావతి పేరుతో కాంట్రాక్టర్ల నుంచి వేల కోట్లు చంద్రబాబు దోచేశాడన్నారు. ఆరోగ్యశ్రీలో కార్పొరేట్ ఆసుపత్రులకు సొమ్ములు చెల్లించలేదని, 108 వాహనాల రిపేర్లు చేయించలేదని, పేదల సౌకర్యాలను పక్కన పెట్టి అడ్డగోలుగా సంపాదించాడన్నారు.

కౌలు రైతులకు 'భరోసా'

భీమవరం(ప్రకాశం చౌక్): కౌలు రైతులకు రైతు భరోసా వెన్నుదన్నుగా నిలుస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రాష్ట్రంలోని పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీ ఆర్సీలు) పొందిన వారిలో అర్హులైన 1,46,324 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులు, దేవదాయ భూముల సాగుదారులకు తొలి విడత రూ.7500 చొప్పున వరుసగా ఐదో విడత వైఎస్సార్ రైతు భరోసా సాయంగా రూ.109.74 కోట్లు, పంట నష్టపోయిన 11,373 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.11.01 కోట్లు మొత్తం రూ.120.75 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, సభ్యులు, అధికారులు వర్చువల్ గా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులు పెట్టుబడి సాయం వినియోగించుకుని ఆర్థిక లబ్ధి పొందాలన్నారు. లబ్ధిదారులకు రైతులకు కలెక్టర్ చేతుల మీదుగా నమూనా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కై గాల శ్రీనివాసరావు, సభ్యులు కొట్టి కుటుంబరావు, వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముగిసిన పొగాకు వేలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం –2లో శుక్రవారంతో వేలం ప్రక్రియ ముగిసినట్లు వేలం నిర్వహణాధికారి సీహెచ్.సురేంద్రకుమార్ తెలిపారు. 2022–23 కాలానికి కేంద్రం పరిధిలో 10.54 మిలియన్ కిలోలకు అనుమతివ్వగా రైతులు 11.94 మిలియన్ కిలోల పొగాకును విక్రయించుకున్నట్లు చెప్పారు. 122 రోజుల పాటు ఈ వేలం కొనసాగింది.

క్లుప్తంగా

చెరువులోపడి వ్యక్తి మృతి


కటికరెడ్డి సత్యనారాయణ (ఫైల్)

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెంకు చెందిన కటికరెడ్డి సత్యనారాయణ (50) ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై ఎం వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం పడమటిపాలెంకు చెందిన సత్యనారాయణకు చెందిన పశువులు గురువారం సాయంత్రం స్థానిక చెరువులోకి దిగాయి. వాటిని తోలేందుకు చెరువులోకి దిగిన సత్యనారాయణ నీటిలో పడి మునిగిపోయాడు. పశువులు ఇంటికి వచ్చినా యజమాని ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకి తెలియలేదు. శుక్రవారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సత్యనారాయణకు భార్య శాంతకుమారి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వీరబాబు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఉండి: ఉండి మండలం వాండ్రం పరిధిలోని ఓ ఐస్ ఫ్యాక్టరీ వెనుక ట్రాక్‌పై రైలు నుంచి జారిపడి కృష్ణాజిల్లా కలిదిండి గ్రామానికి చెందిన శివ రామకృష్ణ (38) అనే వ్యక్తి మృతిచెందాడు. భీమవరం రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ట్రాక్‌పై రిపేర్లు చేస్తూ వెళుతున్న కీమెన్‌లకు సదరు వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న భీమవరం రైల్వే ఎస్సై పీటీవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. రామకృష్ణ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు గుర్తించారు. రామకృష్ణ జేబులో దొరికిన ఫోన్ నంబర్ ఆధారంగా ఆయన కుటుంబీకులకు సమాచారం అందించారు. రామకృష్ణ భార్య, తండ్రిలకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో విద్యార్థిని మృతదేహం


భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం 35 వార్డు బీసీ కాలనీకి చెందిన వాసంశెట్టి హారిక (16) గురువారం రాత్రి యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకింది. పోలీసుల గాలింపులో శుక్రవారం ఉదయం డంపింగ్ యార్డ్ వద్ద హారిక మృతదేహాన్ని గుర్తించారు. టూటౌన్ ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాలు ప్రకారం.. హారిక తన తల్లిదండ్రులు గొడవ పడుతున్న సమయంలో అడ్డుపడింది. దీంతో తండ్రి కొట్టడంతో మనస్తాపానికి గురైంది. దీంతో యమదుర్రు డ్రెయిన్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

వాటర్ ప్లాంట్ మెట్ల కింద..

చాట్రాయి: చాట్రాయిలోని పాతబడిన వాటర్ ప్లాంట్ మెట్ల కింద వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై స్వామి శుక్రవారం తెలిపారు. మృతుడి ద్విచక్రవాహనం ఆధారంగా లింగపాలెం తువచిలక గ్రామానికి చెందిన వేంపాటి ప్రసాదు(58)గా గుర్తించామన్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు చెప్పారు.

రాజన్నా.. నీ మేలు మరువలేం

- వేలాది మందికి నెరవేరిన సొంతింటి కల
- భీమవరంలో 82 ఎకరాల భూమి సేకరణ
- నేడు దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతి




భీమవరం తాడేరు రోడ్డులో రాజశేఖరరెడ్డి హయాంలో కట్టించిన ఇళ్లు

భీమవరం(ప్రకాశం చౌక్): మహానేత రాజశేఖరరెడ్డి పాలన పేదలకు స్వర్ణయుగం. ఆయన హయాంలో పేదలకు సొంతింటికల నెరవేరింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదింటి బిడ్డలు పెద్ద చదువులు చదివి నేడు ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. పేదల ఆరోగ్యం కోసం అప్పటివరకు ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి చేయని సాహసం చేసి ఆర్థిక ఇబ్బంది ఉంటుందని తెలిసి కూడా ముందుడుగు వేసి తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం వేలాది మంది పేదల ప్రాణాలను నిలిపింది. ఆరోగ్యశ్రీ నేటికీ పేదల ప్రాణాలను కాపాడుతునే ఉంది. అంతటి గొప్ప పాలన అందించిన మహానేత వైఎస్ ప్రజలకు దూరమై 14 ఏళ్లు పూర్తయింది. నేటికీ ఆయన ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడే. శనివారం వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన మేలును గుర్తుచేసుకుందాం.

82 ఎకరాల భూ సేకరణ

రాజశేఖరరెడ్డి మొదటి సారి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గునుపూడి ప్రాంతంలో 82 ఎకరాలు భూమి సేకరించారు. దీనికి వైఎస్ ప్రభుత్వం రూ.19.50 కోట్లు ఖర్చు చేసింది. ఆ భూమిలో నేడు టిడ్కో ఇళ్ల నిర్మించారు. భీమవరం పట్టణంలో తాడేరు రోడ్డులో వైఎస్సార్ ఏడు వేల మందికి ఇళ్లు మంజూరు చేశారు. దివంగత నేత వైఎస్ సహకారంతో పేదలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సొంతిళ్లు కట్టించారు. వారి సొంతింటి కల నెరవేర్చారు. ఆ ప్రాంతం నేడు వైఎస్సార్ కాలనీగా నిలిచింది.

ఆరోగ్యశ్రీ బతికించింది



2008 ఏడాదిలో నాకు తీవ్ర అనారోగ్యం చేసింది. కడుపులో పెద్ద కణితి ఉంది. ఆపరేషన్ చేయాలని, అందుకు చాలా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆ సమయంలో మహనుభావుడు రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ నన్ను బతికించింది. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, మోషేన్‌రాజు దగ్గరుండి ఆరోగ్యశ్రీలో నాకు ఆపరేషన్ చేయించారు. కడుపులోని 28 కిలోల కణితిని వైద్యులు తొలగించారు. దాంతో నేను బతికాను. ఆరోగ్యశ్రీ లేకపోతే నేను ఉండేదాన్ని కాదు. మహనుభావుడు రాజశేఖరరెడ్డిని మా నాన్నలాగ కొలుచుకుంటాను.

– ఉరదాల సన్యాసమ్మ, భీమవరం

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో భవిష్యత్



మహానేత రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్లే నేను ఇంజినీరింగ్ చదువుతున్నాను. ఆ రోజుల్లో ఇంజినీరింగ్ అంటే చాలా ఖర్చుతో కూడుకున్న కోర్సు. ఆ సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులోకి రావడంతో నాకు ఇంజినీరింగ్ సీటు దొరికింది. చదువు పూర్తి చేశాక రైల్వే లోకో పైలెట్ ఉద్యోగం సాధించాను. నేడు సీనియర్ అసిస్టెంట్ లోకో పైలెట్‌గా పనిచేస్తున్నాను. ఇటీవల వచ్చిన వందే భారత్ ట్రైన్‌ను కూడా నడిపే స్థాయికి వచ్చానంటే నాడు చదువుకు సహకరించిన దివంగత నేత రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంటే కారణం.

– కదలి బాలకృష్ణ, పడమటి పాలెం, వీరవాసరం మండలం


వందే భారత్ ట్రైన్‌ను నడుపుతున్న కదలి బాలకృష్ణ

ఉత్తమ ఉపాధ్యాయులుగా పలువురి ఎంపిక


అల్లు శ్రీను

ఉంగుటూరు: మండలంలోని ఉప్పాకపాడులో ఫౌండేషన్ ప్లస్ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ అల్లు శ్రీనివాసరావుకి 2023 సంవత్సర రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిందని ఉంగుటూరు ఎంఈఓ-1 నిమ్మగడ్డ రవీంద్ర భారతి తెలిపారు. కష్టపడి పనిచేసే ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు, మండల కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక


బి.నాగేశ్వరరావు

కామవరపుకోట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా మండలంలోని రావికంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగడ్డ నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా గోపాలరెడ్డి


బీఎం గోపాలరెడ్డి

తణుకు టౌన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తణుకు రూరల్ మండలం తేతలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బీఎం గోపాలరెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల్ని సత్కారంలో భాగంగా తనను ఎంపిక చేసినట్లు చెప్పారు. 1990లో పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలో స్పెషల్ టీచర్‌గా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన గోపాలరెడ్డి సోమరాజు ఇల్లిందలపర్రు, వేల్పూరు, కొమరవరం, తణుకు పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రస్తుతం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు సైకాలజిస్టుగా, సైంటిఫిక్ మెజిషియన్‌గా గోపాలరెడ్డి ప్రసిద్ధి చెందారు.

భవానీప్రసాద్‌కు జీనియస్ టీచర్ అవార్డు


భవానీప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్‌కు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు చెందిన స్వదేశ్ సంస్థాన్ భారత్ సంస్థ జీనియస్ టీచర్ అవార్డు ఇచ్చింది. ఈ అవార్డును గురుపూజోత్సవం రోజున అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏలేటిపాడు హైస్కూలు హెచ్‌ఎంకు అవార్డు


దాసరి సత్యనారాయణ

ఇరగవరం: ఇరగవరం మండలం ఏలేటిపాడు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు దాసరి రామ వెంకట సత్యనారాయణ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు నిరంతర కృషి, ప్రణాళికా బద్ధంగా పని చేయడం వల్ల ఈ అవార్డుకు దక్కినట్లు చెప్పారు.

దెందులూరులో అగ్నిప్రమాదం

దెందులూరు: స్థానిక కాశీకాలనీలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా రెండిళ్లు దగ్ధమయ్యాయి. డి.సత్యనారాయణ, రామాంజనేయులకు చెందిన ఇళ్లు సామగ్రితో పాటు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. వీఆర్‌ఓ అనిల్, గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి ఘటనా స్థలిని పరిశీలించారు.

కౌలు రైతులకు రూ.8.76 కోట్ల లబ్ధి

- వైఎస్సార్ భరోసా – పీఎం కిసాన్'లో 11,676 మందికి మేలు
- 48 మందికి రూ.7.67 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ


రైతులకు వైఎస్‌ఆర్ రైతు భరోసా-పీఎం కిసాన్ పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): జిల్లాలో రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుత ఏడాదిలో మొదటి విడతలో 11,676 మంది కౌలు రైతుల ఖాతాలకు రూ.8.76 కోట్లు జమ చేశారని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరుసగా ఐదో ఏడాది తొలి విడత రూ.7500 చొప్పున 1.46 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులు, దేవదాయ భూములు సాగుదారులకు రూ.109.74కోట్లు, వర్షాలకు నష్టపోయిన 11,373 మంది రైతులకు రూ.11.01 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి లావణ్యవేణి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఉద్యాన శాఖ డీడీ ఎస్.రామ్మోహన్, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొదటి దఫా రూ.7,500 చొప్పున 11,621 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతుల ఖాతాలకు రూ.8.72 కోట్లు, ఎండోమెంట్ రైతులు 55 మందికి రూ.4 లక్షలు వారి ఖాతాలకు జమచేసినట్టు చెప్పారు. అదే విధంగా గత మే, జూన్ మాసాల్లో అధిక వర్షాలకు పంట దెబ్బతిన్న 48 మంది రైతులకు వారి ఖాతాలకు రూ.7,66,550 జమ చేశారని తెలిపారు. నియోజకవర్గాల వారీగా చింతలపూడిలో 2851 మంది కౌలు (సీసీఆర్‌సీ) రైతులకు రూ.2.14 కోట్లు, దెందులూరులో 2964 మంది రైతులకు రూ.2.22 కోట్లు, ఇద్దరు ఎండోమెంట్ రైతులకు రూ.15 వేలు, ఏలూరులో 476 మంది కౌలు రైతులకు రూ.35.70 లక్షలు, గోపాలపురం నియోజకవర్గం ద్వారకాతిరుమలలో 427 మంది కౌలు రైతులకు రూ.32.02 లక్షలు, కైకలూరులో 482 మంది కౌలు రైతులకు రూ.36.15 కోట్లు, ఎండోమెంట్ రైతులు 44 మందికి రూ.3.30 లక్షలు, నూజివీడులో 1024 మంది కౌలు రైతులకు రూ.76.80 లక్షలు, ఎండోమెంట్ రైతులు ఐదుగురికి రూ.37,500, పోలవరంలో 1691 మంది కౌలు రైతులకు రూ.1.27 కోట్లు, ఎండోమెంట్ రైతులు ఇద్దరికి రూ.15 వేలు, ఉంగుటూరులో 1969 మంది కౌలు రైతులకు రూ.1.48 కోట్లు, ఎండోమెంట్ రైతులు ముగ్గురికి రూ.25,500 జమ చేశారని వివరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్‌ఆర్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లకు రూ.67,500 రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు నాలుగు సంవత్సరాలుగా ఏడాదికి రూ.13,500 చొప్పున రూ.61,500 రైతుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు.

అవకతవకలకు చెక్



సీఎం జగన్ ప్రవేశపెట్టిన వైఎస్సార్ రైతు భరోసా రైతులకు ఎంతో మేలు చేకూరింది. ఏ సీజన్ లో పంట నష్టపోతే అదే సీజన్‌లో నష్టపరిహారం అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పారదర్శకంగా, నిజాయితీగా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు భరోసాగా కల్పిస్తున్నారు. ధాన్యం కొనుగోలులో అవకతవకలను అరికట్టారు. ఆర్బీకేల్లో పని చేసే యువత కూడా అద్భుతంగా పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయం పెట్టుబడులకు రైతు భరోసా సొమ్ము ఉపయోగపడుతుంది.

– జి.సాంబశివరావు, రైతు, పాలగూడెం, ఏలూరు మండలం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



రెండెకరాల భూమి తీసుకొని కౌలు చేస్తున్నాను. వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకంలో అందుతున్న ఆర్థిక సాయం సాగు పెట్టుబడికి ఉపయోగపడుతుంది. తమలాంటి కౌలు రైతులను ఆదుకొంటున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– పి.సునీత, కౌలు రైతు, మల్కాపురం, ఏలూరు మండలం

ఇద్దరు దొంగల అరెస్ట్

రూ.10 లక్షల సొత్తు స్వాధీనం


చోరీ కేసులో అరెస్టు చేసిన వ్యక్తులను చేపుతున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ శుక్రవారం వన్‌టౌన్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఏలూరు వంగాయగూడెంకు చెందిన ఇసుకలేటి మోజెస్, ప్రస్తుతం రాజమహేంద్రవరంలో నివాసం ఉంటోన్న ఇసుకలేటి క్రాంతి అనే ఇద్దరు బంధువులు. అన్నదమ్ములైన వీరిపై గతంలో దారిదోపిడీ, రోబరీ కేసులు ఉన్నాయి. ఇటీవల ఏలూరు రూరల్, వన్‌టౌన్ ప్రాంతంలో ఇళ్లలో చోరీలు జరగటంతో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాలపై వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ నిఘా పెట్టారు. వన్‌టౌన్ ఎస్సై ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వీరిద్దరి నుంచి 15 కాసుల బంగారు ఆభరణాలు, ఒక ట్యాబ్, రెండు ల్యాప్‌టాప్స్, ఒక సెల్ ఫోన్, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారుగా రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

● గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


పెదనిండ్రకొలను గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: ప్రభుత్వ పరిపాలనను ప్రజల చెంతకు తెచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం పెదనిండ్రకొలను గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం ప్రారంభోత్సవంలో ఎంపీ శ్రీధర్ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీతో కలిసి పాల్గొన్నారు. దేశంలో తొలిసారి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులను గ్రామంలోనే అందుబాటులో తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎంపీ అన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతోపాటు ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలకు, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లకు, రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం సొంత భవనాలు నిర్మిస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు.

హత్యాయత్నం ఘటనలో భర్త అరెస్ట్

జంగారెడ్డిగూడెం: భార్యపై హత్యాయత్నం చేసిన ఘటనలో భర్తను అరెస్టు చేసినట్టు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్థానిక తాండ్ర పాపారాయుడు నగర్‌కు చెందిన గంగాభవానికి, వీరమల్లు శ్రీనుకు 16 సంవత్సరాల క్రితం వివాహమైందన్నారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నట్టు చెప్పారు. కొంతకాలంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారని తెలిపారు. అయితే వేరే వ్యక్తితో సహజీవనం చేస్తుందని భావించిన శ్రీను కీచైన్‌కు ఉండే చాకుతో గంగాభవాని పీక కోసినట్టు పేర్కొన్నారు. ఆమె స్పృహ తప్పి పడిపోగా, శ్రీను పారిపోయినట్టు తెలిపారు. ఆమెను స్థానిక ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేస్తున్నారని, ఈ కేసులో భర్త శ్రీనును అరెస్టు చేశామని చెప్పారు.

పారదర్శకంగా ఎస్సై సెలెక్షన్స్

ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ అతుల్‌సింగ్


సెలెక్షన్స్‌పై సూచనలిస్తున్న ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్, చిత్రంలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీలు మేరీ ప్రశాంతి, సతీష్‌కుమార్



ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో ఎస్సై సెలెక్షన్స్‌లో పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్సై) పోస్టులు భర్తీ చేస్తోందని, ఎంపిక పోటీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్ అన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో దేహదారుఢ్య పరీక్షలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వహణ తీరుతోపాటు అభ్యర్థుల ఎంపికపైనా ఆరా తీశారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌ను ఫిజికల్ టెస్ట్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏలూరు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, కాకినాడ ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌లతో ఎస్సై సెలక్షన్స్‌పై సమీక్షించారు. పోటీలను నిర్వహణపై అతుల్‌సింగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సై పోస్టుల నియామక ప్రక్రియ మొదటి దశలో ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి రెండో దశ ఎంపికలు ఫిజికల్ టెస్ట్‌లకు పిలిచామన్నారు. దేహదారుఢ్య పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏలూరు రేంజ్ పరిధిలో 9,689 మంది అభ్యర్థులు ఫిజికల్ టెస్ట్‌లకు హాజరవుతున్నట్టు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షల్లో అర్హులైన అభ్యర్థులకు తుది దశలో ఫైనల్ ఎగ్జామ్ నిర్వహిస్తామని, ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎస్సై పోస్టుల్లో నియమిస్తామని చెప్పారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్, కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా ఆధ్వర్యంలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, డీఎస్పీలు సున్న మురళీకృష్ణ, విజయ్‌పాల్, ప్రభాకరరావు, సీఐలు, ఎస్సైలు, ఏఆర్ ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

లోకేశ్ దిష్టిబొమ్మ దహనం

కొయ్యలగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శుక్రవారం అంకాలగూడెంలోని మహానేత వైఎస్సార్ విగ్రహం ఎదుట కొయ్యలగూడెం – పోలవరం రోడ్డుపై ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఒక్కసారి కూడా విజయం సాధించలేని లోకేశ్‌కి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం బాలరాజును విమర్శించే స్థాయి లేదన్నారు. నాడు దోచుకో దండుకో అంటూ చంద్రబాబు నాయుడు పాలన సాగిందని, నేడు సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండడాన్ని చూసి ఓర్వలేని టీడీపీ, జనసేన పార్టీలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని, బాలరాజును ఈసారి 50వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. అగ్రికల్చర్ అడ్వైజర్ కమిటీ మెంబర్ గంటా రాంబాబు, ఎంపీటీసీలు జాన్ డేవిడ్ కింగ్, తేలే శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా సుబ్బారావు, ఆసుబోయిన సత్యనారాయణ, వసంతాటి విజయకుమార్, జొన్నకూటి దొరబాబు, మద్దిపాటి కిషోర్, మనెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం



కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిల సాంస్కృతిక నృత్య ప్రదర్శన దృశ్యం

అత్తిలి: కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్ర వారం సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈసందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సంస్కృత భాష విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. ఈసందర్భంగా పాఠశాలకు రూ. 35వేలు విలువగల సౌండ్ సిస్టమ్, విద్యార్థుల భోజనాల కోసం 100 కంచాలు, రూ. 10 వేలు విలుగల యోగా కార్పెట్‌ను దాతల అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ ధననూకరాజు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖుడు రామ్మూర్తి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మోదుగ గుంటలో భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట గ్రామంలో శుక్రవారం భవన నిర్మాణకార్మిక సంఘ సమావేశం కే.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవర ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు మెరుగైన పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కుందేటి శ్రీనివాస్, సీహెచ్.జాన్, రేలంగి గంగరాజు, పామర్తి జాన్, కుందేటి పోసేంద్రప్రసాద్, అంగర ఆంజనేయులు, శివ, ఉప్పు రామ్మోహన్, అంగర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాసా ధ్రువపత్రాలు అందుకున్న దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: నేషనల్ ఏరోనాటిక్స్, స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా), నేషనల్ స్పేస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్పేస్ సెటిల్మెంట్ డ్రాయింగ్ కాంటెస్ట్‌లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ధ్రువపత్రాలను అందుకున్నారు. బందిల హేమ తేజశ్రీ (10వ తరగతి), రాపాక సమత (7వ తరగతి)లకు ఈ ధ్రువపత్రాలు అందాయని హెచ్‌ఎం చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవాలి



ముదునూరులో నా మట్టి-నా దేశం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెంటపాడు: దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాల ను ప్రతీఒక్కరూ గుర్తించుకోవాల ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పేర్కొన్నారు. బీజేపీ చేపట్టిన మేరా మాటి- మేరా దేశ్ (నామట్టి- నాదేశం) కార్యక్రమం శుక్రవారం పెంటపాడు మండలం మదునూరు గ్రామంలోని వెలంపేట వినాయకుని ఆలయం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీ , పసుపులేటి అమ్మిరాజు, కుదుళ్ల సత్యనారాయణ, ఆరాధ్యుల అంజి, దత్తు వెంకటేష్, రామగాని సత్యనారాయణ, కోట రాంబాబు, అయినం బాలకృష్ణ, ముప్పిడి సురేష్ రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు దత్తు ప్రసాద్, మండల బీజేపీ ఇన్‌చార్జి నరిశే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించుకోవాలి

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కుంచనపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



కుంచనపల్లిలో హెల్త్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ఎన్నుకోవాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కుంచనపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మధ్య దళారులకు అవకాశం లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతీ వలంటీర్‌కు 50 ఇళ్లను కేటాయించి, వారి యోగక్షేమాలను చూస్తున్నారన్నారు. తద్వారా ఎంతో మంచి పరిపాలన అందిస్తున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల చేతుల్లో సంక్షేమ పథకాలు ఉండటంతో సొమ్ములు చెల్లించే పరిస్థితి ఉందన్నారు. స్థానికంగా నాయకులు దోచేస్తే రాష్ట్ర ప్రజలను చంద్రబాబు అడ్డంగా దోచేశాడన్నారు. అధికారంలోకి వచ్చే వరకు ఎన్నో ఆశలు చూపి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చినహామీలన్నింటిని గాలికొదిలేశాడని విమర్శించారు. దీంతో 2019 ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు ఇంటికి పంపించారన్నారు. మరలా తొమ్మిది నెలల్లో ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజల్ని మోసం చేసేందుకు కొత్త కొత్త హామీలతో వస్తున్నాడన్నారు. ఇప్పటి వరకు చంద్రబాబు, లోకేశ్‌లు వేల, లక్షల కోట్లు దోచేసి విదేశాల్లో దాచేశారన్నారు. రాజకీయ పార్టీ అంటే ఏదో లక్ష్యంతో ఉండాలన్నారు. ఎటువంటి సిద్ధాంతం లేని పార్టీ జనసేన అని ఎద్దేవా చేశారు. నిలకడ లేని మనస్తత్వంతో పవన్ మాట్లాడుతున్నాడన్నారు. సినిమాల మాదిరిగా చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టును చదువుతున్నాడని, సినిమాలకు, రాజకీయాలకు పెద్ద వ్యత్యాసం లేదన్నారు. కాపు సామాజికవర్గం పరువు పవన్ తీస్తున్నాడని దుయ్యబట్టారు. పవన్‌ను డీగ్రేడ్ చేసి, ప్రతిపక్ష హోదా నిలబెట్టుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నాడన్నారు. చంద్రబాబును ఒక కంట కనిపెడుతూనే 2024 ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగన్‌ను గెలిపించాలని ప్రజల్ని కోరారు. ముందుగా గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ఆయన ప్రారంభించారు. విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం పాలకమండలి డైరెక్టర్ మారం వెంకటేశ్వరరావు, ఎంపీపీ పి.శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్లు గుమ్మళ్ళ తాతారావు, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు తాడేపల్లి మోషే, కనుపూరి ఉదయభాస్కర్, ఉర్ల నవీన్, చిన్నం రమేష్, మేకా శ్రీను (నాని), ఇంటి ఆదినారాయణ, మేకా సత్యనారాయణ, సోమా మురళీ, బొద్దాని శ్రీనివాస్, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్,ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేశు, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, డీడీవో ఆర్‌వీ.బ్రహ్మం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌కు ఘన నివాళులు

తణుకు అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం తణుకులో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని, అనంతరం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని రోగులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తారని వివరించారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

తణుకు టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ పోలీస్, పంచాయతీల నుంచి అనుమతులు పొందాలని తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం తణుకు ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో సీఐ పాల్గొని మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలకు సంబందించి గ్రామాల్లో మందిరాల ఏర్పాటుకు పంచాయతీ ఉత్సవ కమిటీ డిక్లరేషన్ ఇవ్వాలని చెప్పారు. పోలీసు నుంచి లౌడ్‌స్పీకర్‌కు సంబందించి అనుమతి తీసుకోవాలని చెప్పారు. వినాయక చవితి ఉత్సాహంగా జరిగేందుకు శాంతియుతంగా నిర్వహించేలా సహకరించాలని కమిటీలను కోరారు. విగ్రహాలకు, పందిళ్లకు రాత్రి సమయాల్లో కాపలా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, రూరల్ ఎస్సై గురవయ్య, ఈవోపీఆర్‌డీ పీవీవీ రామ్‌ప్రసాద్, అగ్నిమాపదళ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

తణుకులో ఎల్‌ఐసీ 67వ వారోత్సవాలు



తణుకు ఎల్‌ఐసీ బ్రాంచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మేనేజరు రాజశేఖర్, ఉద్యోగులు, ఏజెంట్లు

తణుకు అర్బన్: ఎల్‌ఐసీ 67వ వారోత్సవాలు తణుకు ఎల్‌ఐసీ కార్యాలయం శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సీనియర్ బ్రాంచ్ మేనేజరు కేఎస్ రాజశేఖర్ జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1956లో సెప్టెంబరు 1న స్థాపించబడ్డ ఎల్‌ఐసీ సంస్థను రూ. 5 కోట్లు పెట్టుబడితో ప్రారంభించారని ఇప్పుడు పదిలక్షల కోట్లుతో వటవృక్షంలా ఎదిగిందన్నారు. భారతదేశంలో ప్రతి గ్రామంలోను ఎల్‌ఐసీ విస్తరించిందని, 8జోనల్ ఆఫీసులతో 2048 బ్రాంచ్‌లతో ఖాతాదారులకు విశేష సేవలందిస్తుందని అన్నారు. వారోత్సవాల్లో భాగంగా వారంరోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు వంటివి నిర్వహిస్తామని చెప్పారు. తణుకు సంస్థ లక్ష్యాలను చేధిస్తూ రాజమండ్రి డివిజన్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్నట్లు స్పష్టం చేశారు. ముందుగా సీనియర్ ఉద్యోగి సత్యనారాయణతోపాటు వారోత్సవాల్లో మొదటి పాలసీదారుడిని సత్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పిఆర్‌కె మూర్తి, ఉద్యోగులు రామకృష్ణ, శ్యామ్‌కుమార్, పుష్పరాజ్, సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పరమహంస, శ్రీనివాస్, హరికృష్ణ, జేవీ రావు, క్లియాస్ సలాది ఉదయభాస్కరరావు, దంగేటి వెంకటేశ్వరరావు, మూర్తి ఆచార్యులు, ఏజెంట్స్ బొలిశెట్టి రామనాధ్, లేళ్ల సత్యనారాయణ, రామారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సర్వే వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న భూ సర్వే అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కును త్వరగా పూర్తి చేయాలని పీడీఎంఏ కోటేశ్వరరావు సూచనలు చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శామ్యూల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీసర్వేలో ఆస్తి తప్పులు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. త్వరలోనే వార్డు, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భూ రీసర్వే అధికారి సుబ్బారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కోటేశ్వరరావు, సర్వేయర్ రామకృష్ణ, మున్సిపల్ ఇంజనీర్ మురళీకృష్ణ, పట్టణ ప్రణాళికా అధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా తణుకు రూరల్ మండలం మండలం దువ్వ గ్రామంలో శ్రీ దానేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతములు నిర్వహించారు. ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతముల్లో దువ్వ, పరిసర గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

8న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెంటపాడు: మండలంలోని శ్రావణమాసం పురస్కరించుకొని ప్రతిపాడు వై.జంక్షన్ వద్ద వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 8న సామూహిక శ్రావణలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బళ్ల నిలకంఠం, ఆలయ కమిటీ చైర్మన్ సైపురెడ్డి రాంబాబులు తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద వారు మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణ ట్రస్టు, కనకదుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా అమ్మవారి వ్రతాలు చేయించనున్నట్లు తెలిపారు. ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి ఆదేశాల మేరకు భారీగా నిర్వహించబోయే ఈ పూజలలో పాల్గొనే మహిళలు ముందుగా ఆలయం వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ



తాడేపల్లిగూడెం పట్టణంలోని సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మోదీ తెచ్చిన విద్యుత్ సంస్కరణల అమలుతో విద్యుత్ చార్జీలు భారీగా పెరిగాయని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణలు విమర్శించారు. అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని 16 నుంచి 25వ వార్డు సచివాలయాల వద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, పేదల సమస్యలు పరిష్కరించాలని, వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, మడక రాజు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, పోతు శ్రీను, సిద్ధిరెడ్డి శేషుబాబు, జవ్వాది శివ, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న, కొమ్మిరెడ్డి ఉదయ్, గొర్రెల వంశీ తదితరులు పాల్గొన్నారు.

మాధవరంలో సంతకాల సేకరణ

సీపీఎం పార్టీ సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాధవారం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలోనూ, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. సీపీఎం నాయకులు గుత్తుల నరస్సయ్య, పురిటిగడ్డ జయమ్మ, పరమేశు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా



అత్తిలిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సీడీపీఓ ప్రమోదకుమారి

అత్తిలి: గర్భిణీలు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తోందని తణుకు సీడీపీఓ ప్రమోదకుమరి అన్నారు. అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో టేక్‌హోం రేషన్ పంపిణీ అమలు ఎలా జరుగుతోందో పర్యవేక్షించారు. పిల్లల బరువులు, ఎత్తులు క్రాస్ చెక్ చేశారు. ఎనిమిక్ తల్లులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు ఐరన్, కల్షియం ట్యాబ్లెట్లను క్రమం తప్పకుండా వేసుకుని, సమతుల ఆహారం భుజించడం ద్వారా రక్తహీనత దరిచేరదని ఆమె తల్లులకు తెలిపారు. మునగాకు ప్రాముఖ్యతను తెలిపి, తప్పనిసరిగా రోజువారీ ఆహారంలో మునగాకును క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ సుభద్ర, జీఎంఎస్‌కే దయామణి, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సమాజం



కృష్ణాయపాలెం గ్రామంలో దోమల నివారణ కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నా రు. శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో ఫ్రైడే డ్రైడే, ఫీవర్ సర్వే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజానికి దోమలే ప్రధాన శత్రువులని, వాటిని నివారించాలన్నారు. చెత్తా చెదారాలు పేరుకుపోయిన ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. రాత్రి సమయాల్లో దోమ తెరలను వినియోగించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యకర్తలు సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ బాబ్జీ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

భీమవరం(ప్రకాశం చౌక్): ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవాదికారా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భీమవరం తాలూకా తాపీ పనివారల సంఘం భవనం నందు 'అసంఘటిత రంగంలోని పని వారికి న్యాయ సేవలు' అనే పథకం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యానల్ లాయర్ పి.అంబేద్కర్, డి. రవి కిరణ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎ.లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అందకపోతే న్యాయ సేవాధికార సంస్థ వారికి దరఖాస్తు రూపంలో తెలియజేయవచ్చన్నారు. అందరూ తప్పని సరిగా ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారు రిజిస్టర్ అయ్యి ఉండాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డ్, బీదపనివారల సంక్షేమ బోర్డ్, చేతి వృత్తులు వాటి సంక్షేమ కార్పొరేషన్ వంటి సంస్థల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరూ తెలుసుకోవాలన్నారు.

ఓటు నమోదు సామాజిక బాధ్యత

భీమవరం(ప్రకాశం చౌక్): ఓటు నమోదు సామాజిక బాధ్యత, ఓటు సద్వినియోగం నైతిక బాధ్యత అని డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదు.. ఓటు సద్వినియోగం ప్రచార భేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఈ విషయంపై చేస్తున్న కృషికి స్పందించి మా కళాశాలలో ఓటు నమోదు లేని విద్యార్థులకు ఆన్ లైన్ ద్వారా ఓటు నమోదు చేయిస్తామని అన్నారు. రెండు మూడు రోజులపాటు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పాండు రంగరాజు అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వమే అన్ని చేయాలంటే కష్ట తరమని, విద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఓటు నమోదుపై కృషి చేయాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఓటు హక్కు ప్రతిజ్ఞ నిర్వహించి డిగ్రీ కళాశాలలో 26 మంది పలు గ్రామాల విద్యార్థులకు ఫారమ్-6 పత్రాలను అందించామని తెలిపారు. కళాశాలలో కూడా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి రామకృష్ణంరాజు, పాలకవర్గ సభ్యులు కొత్తపల్లి శివరామ రాజు, ఎన్ సిసి ఆఫీసర్ ఎ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



